క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



నరసన్నపేట: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం. శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన జె.శ్రీనివాసరావును విశాఖ వీఆర్‌కు బదిలీ అయింది. సీఐ ఎం.శ్రీనివాసరావు పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. సీఐకి నరసన్నపేట సర్కిల్‌లో ఉన్న నలుగురు ఎస్‌ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు.

రెండు బైక్‌లు చోరీ

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లిలో శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. కోల రాజు, కోల శాంతారావుకు చెందిన ద్విచక్ర వాహనాలు ఇంటి బయట తాళం వేసి పార్కింగ్ చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను ఎత్తుకుపోయారు. ఈ మేరకు రాజు, శాంతారావు నరసన్నపేట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు.

రేషన్ సరుకులు బాధ్యతగా పంపిణీ చేయండి

నరసన్నపేట: ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ డిపోల వద్ద సరుకులను కార్డుదారులకు బాధ్యతగా పంపిణీ చేయాలని డీటీ రామకృష్ణ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ డిపో వద్ద తగిన సదుపాయాలు కల్పించాలని, కార్డుదారులకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా సరుకులు సరైన తూకం వేసి ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు డీలర్లందరూ పాటించాలన్నారు. డిపోల బయట ధరల పట్టిక ముద్రించాలన్నారు.

5న ఆలయ భూముల వేలం

పాతపట్నం: జూన్ 5వ తేదీన మండలంలోని అంగారసింగి గ్రామంలో ఉన్న జగన్నాథ, రాధాకాంత స్వామి దేవస్థానం భూములు (37.12 ఎకరాలు) మూడేళ్లకు (2025–2028) బహిరంగ వేలం వేయనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద వేలం ఉంటుందన్నారు. ఈ నెల 19వ తేదీన జరగాల్సిన వేలం వాయిదా పడిందన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.500 ప్రథమ ధరావత్తు చెల్లించాలన్నారు. హెచ్చు పాట పాడుకున్నవారు ఒక సంవత్సరానికి సంబంధించి అడ్వాన్స్ చెల్లించాలన్నారు.

ఉపాధి వేతనదారుల నిరసన



చెరువు వద్ద నిరసన తెలుపుతున్న వేతనదారులు

నరసన్నపేట: మండలంలోని రెడ్డికిపేటలో ఉపాధి వేతనదారులు శనివారం నిరసనకు దిగారు. గ్రామంలోని కారి చెరువులో గడిచిన నాలుగు వారాలుగా 172 మంది వేతనదారులు పని చేస్తున్నారు. ఎప్పటిలాగే ఉదయానికే వేతనదారులు చెరువు వద్దకు వచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ వీరికి పని కల్పించలేదు. పని ఇవ్వాలని వేతనదారులు కోరారు. గ్రామంలో రెండు ఫారం పాండ్స్ మంజూరయ్యాయని, అక్కడికి కొంత మంది వేతనదారులు వెళ్లి పనిచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సూచించారు. మిగిలిన వారికి ఇక్కడ పని కల్పిస్తామని సూచించారు. సుదూరంగా పొలాల్లో ఫారం పాండ్స్ పనికి వెళ్లేందుకు వేతనదారులు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని ఏపీఓ యుగందర్ వద్ద ప్రస్తావించగా.. గ్రామానికి వెళ్లి వేతనదారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. అందరికీ పని కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మూడు గురుకుల పాఠశాలలకు ఎంపిక



వేదశ్రీ

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థిని వరుదు వేదశ్రీ మూడు గురుకుల పాఠశాలలకు ఎంపికైంది. ఎంజేపీఏపీబీసీ గురుకుల ప్రవేశ పరీక్షలో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 267వ ర్యాంకు, ఏపీఆర్ఎస్ గురుకుల విద్యాలయ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 413వ ర్యాంకు సాధించినట్లు హెచ్ఎం సత్యనారాయణ తెలిపారు. వేదశ్రీకి ఎంఈఓలు ఎం.వి.రమణ, భూలక్ష్మి, ఉపాధ్యాయుడు పాటోజు శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థికి అభినందన



చాణుక్యనాయుడుని అభినందిస్తున్న హెచ్ఎం కేశవరావు

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుకున్న విద్యార్థి వై.చాణుక్యనాయుడు సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో రాష్ట్ర స్థాయిలో 28వ ర్యాంకు సాధించాడని హెచ్ఎం తులగాపు కేశవరావు తెలిపారు. చాణుక్యనాయుడును హెచ్ఎం, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు. పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చాణుక్యనాయుడు శిక్షణ తీసుకున్నాడని హెచ్ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.అరుణ, కాంతి రాజు, అన్నాజీరావు, నాగరాజు పాల్గొన్నారు.

రిజర్వాయర్ ఇలా..
సాగునీరు ఎలా?

- వేసవిలో చుక్క నీరులేని బొమ్మిక రిజర్వాయర్
- ఆయకట్టు రైతులకు ఎండమావే..
- 1980లో నిర్మాణం చేపట్టిన రిజర్వాయర్
- అభివృద్ధికి నోచుకోని కాలువలు



బొమ్మిక రిజర్వాయర్



బొమ్మిక రిజర్వాయర్ నుంచి కింద కాలువకు నీరు వెళ్లే డ్యామ్

బూర్జ: వర్షం నీరు వృథా కాకుండా ఉండేందుకు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. కాలువలు కూడా తవ్వారు. వీటి ద్వారా ఏటా రెండు పంటలు పండించడమే ప్రభుత్వ లక్ష్యం. అయితే అందుకు తగిన చర్యలు చేపట్టకపోవడంతో రైతులు సాగునీటి కోసం ప్రతి ఏటా అవస్థలు పడుతున్నారు. బూర్జ మండలంలోని ఎగువ ప్రాంతాల్లో పంటలు పండించేందుకు 1980లో అప్పటి ప్రభుత్వం పెద్దపేట పంచాయతీ బొమ్మిక గిరిజన గ్రామం పైభాగాన రిజర్వాయర్ నిర్మాణం చేపట్టింది. వర్షాభావ పరిస్థితుల్లో ఖరీఫ్, రబీ పంటలు వేసేందుకు, చుట్టుపక్కల కొండల్లోని వరద నీటిని నిల్వ చేసి దిగువ భాగాన ఉన్న పెద్దపేట, మదనాపురం, జగన్నాథపురం, బొమ్మిక, కొండపేట, నీలాపురం, ఏపీపేటలోని 770 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. 2015–16లో రిజ్వాయర్‌తోపాటు కాలువలు ఆధునీకరణకు రూ.9 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టారు. అప్పట్లో కాలువల్లో పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. రబీలో శివారు గ్రామాలకు సాగునీరు అందక ప్రతి ఏటా రైతులు అవస్థలు పడుతున్నారు.

వర్షా కాలంలోనే నీరు..



వర్షాలు బాగా పడితే బొమ్మిక రిజర్వాయర్‌లో చుట్టు పక్కల కొండల నుంచి వరద నీరు చేరి కొంతవరకు నీరు నిల్వ ఉంటుంది. వర్షాభావ పరిస్థితిలో చుక్క నీరు లేక రిజర్వాయర్ వెలవెలబోతుంది. వర్షాభావ పరిస్థితిలో దిగువ ఉన్న భూములకు చుక్కనీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు.

– అద్రక చిన్నారావు, రైతు, బొమ్మిక, బూర్జ మండలం

రబీ పంటలకు నీరు కష్టమే..



ఖరీఫ్‌లో కొంతవరకు పంటలు పండినా, రబీ సీజన్‌లో మాత్రం పంటలకు సాగునీరు అందడంలేదు. పైన ఉన్న కొండల్లో వర్షాలు బాగా పడితే బొమ్మిక రిజర్వాయర్‌లో నీరుచేరుతుంది. వర్షా కాలంలో పంటలు కొంతవరకు పండినప్పటికీ, రబీ పంటలకు నీరు అందడం లేదు.

– సవర వెంకటేష్, రైతు, బొమ్మిక, బూర్జ మండలం

చర్యలు తీసుకుంటాం..

రిజ్వాయర్‌తోపాటు కాలువల ఆధునీకరణకు 2015–16లో రూ.9 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టారు. అప్పట్లో పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. కాలువల అభివృద్ధి విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుళ్లాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

– కె.దాలయ్య, నీటిపారుదల శాఖ, ఏఈఈ, బొమ్మిక రిజర్వాయర్

బీడు భూమి కాదు.. సాగరం..



కొత్తూరు మండలంలోని బలద గ్రామంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పద్మనాభ సాగరం నిర్లక్ష్యానికి గురైంది. సాగరం మొత్తం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి పద్మనాభ సాగరంలోని పిచ్చిమొక్కలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. – కొత్తూరు

కాలువ ఇలా.. సాగునీరు ఎలా?



ఈ చిత్రం జలుమూరు మండల పరిధిలోని గొటివాడ వద్ద పిచ్చిమొక్కలతో నిండిపోయిన 20–ఆర్ కూర్మనాథపురం కాలువ. ఈ ఏడాది సాగునీరు ఎలా వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఇప్పటికే పొలాలను సిద్ధం చేశారు. మరో 15 రోజుల్లో వరి వెదలు, నారు పోయడం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువను బాగు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఏఈ భాను వద్ద ప్రస్తావించగా.. ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తామన్నారు. – జలుమూరు

వరి విత్తనాలు ఎప్పుడిస్తారు?

- అధికారులను నిలదీసిన సభ్యులు
- పదే, పదే చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉదయ్‌భాస్కర్

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా నివేదికలు చదివివినిపించారు. ఎంపీపీ, సభ్యులు తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయశాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో పాతపట్నం-2 ఎంపీటీసీ సభ్యుడు కొండాల యరకయ్య, గురండి సర్పంచ్ శిష్టు తులసీనాయుడు స్పందించారు. ఖరీఫ్ ప్రారంభం కానునుందని రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉండాలని పదే, పదే చెప్పినా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఏఓ భారతి మాట్లాడుతూ.. రైతుల నుంచి వివరాలు సేకరించామని, తర్వాలోనే విత్తనాలు, ఎరువుల కోసం ఇండెంట్ పెడతామన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని ఇంటింటికీ కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా 50 శాతం మాత్రమే జరిగిందని పలువురు సభ్యులు లేవనెత్తారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ పాతపట్నం పంచాయతీలో రూ.1.92 కోట్ల నిధులతో జల్ జీవన్ మిషన్ పనులు పూర్తిచేశామని, ఇంకా రూ.48 లక్షలతో 5 లక్షల లీటర్ల ట్యాంకు నిర్మాణం చేయాల్సి ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, మండల ప్రత్యేకాహ్వానితుడు మొర్రి గణపతిరావు, మండల ప్రత్యేకాధికారి ఎం.కరుణాకరరావు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ టి చంద్రకుమారి, మండల జేఈ టి.ప్రసాదరావు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, బైదలాపురం పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య, ఏపీఓ సురేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంకుమార్చనలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

సారవకోట: మండలంలోని కేశవలస గ్రామంలో శనివారం భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ గ్రామంలోని హనుమాన్ మందిరం ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను శోభయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల సింహాచలం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఓం శాంతి (త్రిలోక్ భవనం) నిర్మాణానికి శనివారం స్థానిక తహసీల్దార్ పాపారావు స్థల పరిశీలన చేశారు. చాపరలో నిర్మించిన త్రిలోక్ భవనంలో ఓం శాంతి బ్రహ్మకుమారీలు అందుబాటులో ఉంటూ ఆధ్యాత్మిక బోధన చేస్తున్నారు. అదేవిధంగా మెళియాపుట్టి ప్రాంతవాసులకు అందుబాటులో ఉండేలా భవనాన్ని నిర్మిస్తే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, యోగా, అదేవిధంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మహోన్నత వ్యక్తుల భక్తి ప్రసంగాలు, ధ్యానం చేయడానికి వీలుగా ఉంటుందని బ్రహ్మకుమారీ సుధ అధికారులను కోరారు. స్థల పరిశీలనలో సర్వేయర్ శ్యామలరావు, సీనియర్ అసిస్టెంట్ జగన్మోహన్, వీఆర్వో రాజు, పరమేష్, కరిమెల్లి సాంబమూర్తి, బ్రహ్మ కుమారీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్తున్న వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు

సారవకోట: మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో ఇటీవల జల్ జీవన్ మిషన్‌లో భాగంగా పైపు లైన్లు వేసేందుకు గోతులు తీశారని, పైపులు వేయలేదన్నారు. గ్రామంలోని శివరామపాత్రుని కోనేరు పూడికలతో నిండిపోయిందని, వాటిని తొలగించి చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్పందిస్తూ.. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయించాలని అధికారులకు ఆదేశించారు.

సాగు, తాగునీటి కల్పనకు ప్రాధాన్యం

మండలంలో సాగు, తాగునీటి కల్పనకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బొంతు ఎత్తి పోతల పథకం పనులు పునః ప్రారంభించి సాగు నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కిడ్నీ సమస్యలు వస్తున్నందున వంశధార రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

సాదాసీదాగా..

సమావేశానికి 13 మంది ఎంపీటీసీలు హాజరుకావాల్సి ఉండగా.. ఎడుగురు మాత్రమే హాజరయ్యారు. 35 మంది సర్పంచ్‌లకు 15 మంది సర్పంచ్‌లు వచ్చారు. వీరిలో ఏడుగురు ప్రతినిధులు హాజరయ్యారు. సభ సాదాసీదాగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, వైస్ ఎంపీపీ జమినివలస కల్యాణి, ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం, ఎంపీడీఓ మోహన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమి అండతోనే ఇసుక అక్రమ రవాణా

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: కూటమి నాయకుల అండతోనే పాతపట్నం నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండలం అంగూరు (ఆకులతంపర), నివగాం ఇసుక ర్యాంప్‌ల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా జరుగుతుందన్నారు. కొత్తూరు నుంచి ఒడిశాకు ఇసుక లారీలతో వెళ్లిపోతున్నా.. అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు. వంశధార నదిలో యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారన్నారు. ఇసుక ఉచితం అని చెప్పి.. కూటమి నాయకులే అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఉచిత ఇసుక అయితే నదిలో యంత్రాలు ఎందుకు పెట్టారని, లారీలతో ఎందుకు తరలించుకుపోతున్నారని ప్రశ్నించారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అండతోనే ఇసుక తరలిపోతుందన్నారు. అందుకే రెవెన్యూ, మైన్స్, పోలీసు శాఖలకు చెందిన అధికారులు ఎవ్వరూ ఇసుక వ్యాపారాన్ని, అక్రమ రవాణాను అడ్డుకోవటం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- హౌసింగ్ శాఖ జిల్లా స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ



లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణ

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని గాజుల కొల్లివలస, ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని ఎన్‌టీఆర్ కాలనీ లే అవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేక పరిశీలన అధికారి వెంకటరమణ సూచించారు. శనివారం ఆయా లేఅవుట్లలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. కొంత మంది లబ్ధిదారులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ పేరుతో ఇదే కాలనీల నిర్మాణాలకు వేగవంతంగా బిల్లులు చెల్లించేవారని పలువురు లబ్ధిదారులు అన్నారు. ప్రస్తుతం బిల్లులు, మెటీరియల్ సక్రమంగా అందించకపోవడంతోనే నిర్మాణాలు చేపట్టలేకపోయామన్నారు. హౌసింగ్ ఏఈ మోహన్‌రావుపై పరిశీలన అధికారి వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. నత్తనడకన సాగుతున్న నిర్మాణాలపై ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. హౌసింగ్ ఈఈ ఎ.అప్పారావు, హౌసింగ్ ఎఫ్ఏసీ డీఈ డి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పరేషన్!

- ఎండీయూ వాహనాల రద్దు
- మళ్లీ రేషన్ దుకాణాల ముందు పడిగాపులే..
- ఉపాధి కోల్పోయిన ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు



వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

హిరమండలం: కూటమి ప్రభుత్వం ఇంటివద్దకే బియ్యం పంపిణీ వ్యవస్థకు మంగళం పాడింది. జూన్ నుంచి రేషన్ దుకాణాల ద్వారానే రేషన్ సరుకులు అందించనున్నట్లు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల కార్డుదారులు మళ్లీ సరుకుల కోసం రేషన్ దుకాణాల ముందు నిలబడాల్సిన దుస్థితి. ఎండీయూ వాహనాల ఆపరేటర్లు,హెల్పర్లు ఉపాధి కోల్పోయారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటివద్దకే రేషన్..

ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందజేసేందుకు ఎండీయూ వాహనాలను తీసుకొచ్చింది. ప్రజలు రేషన్ దుకాణాల ముందు నిలబడాల్సిన అవస్థలు తప్పాయి. కార్డుదారులు ఇంటి దగ్గరకి వచ్చిన వాహనంలో బియ్యాన్ని, సరుకులను తీసుకునేవారు. దీనివల్ల కార్డుదారులకు వ్యయప్రయాసలు ఉండేవికాదు. నాలుగైదు రోజుల్లో రేషన్ పంపిణీ పూర్తయ్యేది.

పాతపట్నం నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు, కార్డుల వివరాలు

మండలం	రేషన్ కార్డులు	దుకాణాలు	ఎండీయూ వాహనాలు
పాతపట్నం	19,929	47	14
హిరమండలం	11,980	31	9
కొత్తూరు	22,150	61	17
మెళియాపుట్టి	16,413	44	12
ఎల్.ఎన్.పేట	10,789	36	7

వాహనాలతోనే రేషన్ అందించాలి



రేషన్ సరుకులు వాహనాలతోనే ఇంటింటికీ అందించాలి. రేషన్ దుకాణాలకి వచ్చి రేషన్ తెచ్చుకోవాలంటే కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. క్యూలో పడిగాపులు కాయాలంటే ఒక రోజు పని కోల్పోతాం. దీనివల్ల ప్రతినెలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గత ప్రభుత్వం మాదిరిగానే బియ్యం, సరుకులు పంపిణీ చేయాలి.

– దీర్ఘాశి చిన్నమ్మడు, పాతహిరమండలం, హిరమండలం మండలం

మళ్లీ కష్టాలు పడాల్సి వస్తుంది



రేషన్ సరుకులు దుకాణాల నుంచే తీసుకోవాలంటే మళ్లీ కష్టాలు పడాల్సి వస్తుంది. బియ్యం పంపిణీ వాహనాలతోనే ఇంటింటికీ అందించాలి. దుకాణాల ద్వారా సరుకులు తీసుకోవాలంటే పనులు మానుకొని గంటల కొద్దీ క్యూలో నిలబడాల్సి వస్తుంది. ప్రభుత్వం ఆలోచించి ఇంటింటికీ బియ్యం పంపిణీ చేసే వాహనాలను కొనసాగించాలి.

– బి.మురళి, తంప గ్రామం, హిరమండలం మండలం

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఆమదాలవలస: యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది



నరసన్నపేట: యోగాసనాలు వేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది

ఆమదాలవలస: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో యోగా దినోత్సవంలో భాగంగా సిబ్బందితో కలిసి శనివారం యోగాసనాలు వేశారు. జాతీయ యోగా డే సందర్భంగా ప్రతీ కార్యాలయంలో నెలరోజులపాటు యోగా శిక్షణ అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద యోగా సాధన చేస్తే దీర్ఘకాలిక రోగాలు దూరమవుతారన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: ప్రాచీన కాలం నుంచి యోగాసనాలకు మంచి ఆదరణ ఉందని, నేటి కంప్యూటర్ యుగంలో కూడా యోగాసనాలు అలవరుచుకోవడం ద్వారా ఒత్తిని తగ్గించుకోవచ్చని నరసన్నపేట తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎంపీడీఓ బి.మధుసూదనరావు అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా నరసన్నపేట తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో శనివారం యోగాసనాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాకివలస ఆయుష్ వైద్యాధికారి సీతామహాలక్ష్మి ప్రభుత్వ ఉద్యోగులతో యోగాసనాలు వేయించి, వాటి ప్రాధాన్యతను వివరించారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.